ప్రాదేశిక పాలనకు మూడేళ్లు

- వైఎస్ జగన్ పాలనలో సామాన్యులకు సంక్షేమం
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గౌరవం
- ప్రభుత్వం మారడంతో తగ్గిన ప్రాధాన్యం



ప్రజాప్రతినిధులుగా గెలిచిన అనంతరం మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధులు (ఫైల్)

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో మూడేళ్ల క్రితం ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగి మండల, జిల్లా పరిషత్‌లు ఏర్పడ్డాయి. అప్పటి జగన్ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి క్రమం తప్పకుండా సామాన్యులకు సంక్షేమ పథకాలు ద్వారా ఆర్థిక సాయం అందించేది. దాంతో ఎంపీటీసీలకు, సర్పంచులకు గ్రామాల్లో గౌరవం ఉండేది. ప్రతి నెలా ప్రభుత్వ సాయం అందుతుండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు తలెత్తుకుని గర్వంగా భావించేవారు. కారణాలేమైనా మూడు నెలల క్రితం ప్రభుత్వం మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి సంక్షేమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారు. నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకుంది. సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ల పంపిణీ తప్ప ఇతర పథకాల అమలు ఊసే లేదు. కూటమి ప్రభుత్వం అలసత్వానికి గ్రామాలు, పట్టణాల్లోని ప్రజాప్రతినిధుల్లో అసహనం అలముకుంది. వైఎస్సార్ సీపీ, కూటమి ప్రభుత్వాల పాలనాతీరును పరిశీలించి, ఎంపీటీసీ, జెడ్పీటీసీల తీరుతెన్నులపై ఈ కథనం...

పరిషత్ ఎన్నికల నేపథ్యమిదీ...

పరిషత్ ఎన్నికలకు 2020లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ కోవిడ్ ప్రభావంతో నోటిఫికేషన్‌ను 2020 మార్చి 15న రద్దు చేశారు. తిరిగి 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు నిర్వహించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో మండపేట మండలం అర్తమూరు 1, రామచంద్రపురం రూరల్ మండలం వెల్ల 1, 2, కె.గంగవరం మండలంలో మూడు మొత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికలు ప్రక్రియ పూర్తయినప్పటికీ ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించడంతో కౌంటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. 2021 సెప్టెంబర్ 19న లెక్కింపు చేపట్టగా 24న సభ్యులుగా ప్రమాణాలు చేయడంతో పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి.

మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచిన జగన్

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు అనగానే సహజంగా పురుషులే పోటీ చేస్తుండేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మహిళా ప్రాధాన్యతను అప్పటి సీఎం వైఎస్ జగన్ పెంచారు. రామచంద్రపురం, మండపేట నియోజవకర్గాల్లో అమలు చేసిన రిజర్వేషన్లు మహిళా ప్రాతినిధ్యంతోపాటు సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుల్లో మండపేట రూరల్ బీసీ మహిళ, రాయవరం, కె.గంగవరం జనరల్ మహిళ, కపిలేశ్వరపురం, రామచంద్రపురం రూరల్ జనరల్, కాజులూరు బీసీ జనరల్ సామాజిక వర్గాల వారు జెడ్పీటీసీలుగా ఉన్నారు. ఎంపీపీ స్థానాల్లో రామచంద్రపురం రూరల్, కాజులూరు స్థానాలకు ఎస్సీ మహిళ, కపిలేశ్వరపురం, కె.గంగవరం ఎంపీపీ స్థానాలకు బీసీ మహిళ, రాయవరం ఎంపీపీ స్థానానికి బీసీ జనరల్, మండపేట రూరల్ ఎంపీపీ స్థానానికి జనరల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మండపేట రూరల్ మండలంలో 22, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల్లో 20 చొప్పున, రాయవరం, కపిలేశ్వరపురంలలో 19 చొప్పున కె.గంగవరంలో 18 మొత్తం 118 ఎంపీటీసీ స్థానాల్లో వివిధ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు సేవలందిస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో ప్రాదేశిక ప్రజాప్రతినిధులిలా...

నియోజకవర్గం	గ్రామాలు	ఎంపీపీ/జెడ్పీటీసీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు
మండపేట	43	03	60
రామచంద్రపురం	75	03	58
మొత్తం	118	06	118

నిండైన మనస్సుతో..

గ్రామంలో సర్పంచులు, ఎంపీటీసీలు అనగానే సామాన్యుల సమస్యలను పరిష్కరించే హుందాతనంతో వ్యవహరించేవారుగా చూస్తారు. చెప్పుకున్న సమస్యను వెంటనే పరిష్కరించిన రోజున స్థానిక ప్రజాప్రతినిధులకు గ్రామంలో గౌరవం ఉంటుంది. అదే జరిగింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో. రేషన్ కార్డు కావాలంటే మండల పరిషత్ కార్యాలయాలు చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారు. గ్రామంలోని సచివాలయంలో అర్ధ గంటలో రేషన్ కార్డులు మంజూరు చేసే వ్యవస్థను జగన్ స్థాపించారు. వారి పనితీరుతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలందరూ గర్వంగా భావించేవారు. నెల నెలా పింఛను సక్రమంగా, పారదర్శకంగా అందిస్తుండడం, ప్రతి గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, పాలసేకరణ కేంద్రాల భవనాలను నిర్మించడంతో గుర్తింపు దక్కేది.

కూటమి పాలనలో ప్రచారార్భాటాలకే ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం పేరుతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇంటింటికీ స్టిక్కర్లు అతికించింది. ఒకప్పుడు క్షణాల్లో ప్రభుత్వ లబ్ధిని అందించిన సచివాలయ ఉద్యోగులను స్టిక్కర్లు అతికించమని ఆదేశించింది. తెల్లవారుజామునే పింఛను అందించిన వలంటీర్‌ను విధులకు దూరంగా ఉంచింది. ఇలా సంక్షేమం మూలన పడిన నేపథ్యంలో తమ పరిస్థితి మళ్లీ పాత రోజులకు మళ్లిందంటూ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తేలిపోయిన కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం వంద రోజులకే ప్రజల్లో తేలిపోయింది. వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే ఇచ్చిన హామీలను వెను వెంటనే అమలు చేయనారంభించారు. ప్రతి గ్రామంలోనూ ఆయన హయాంలో నిర్మితమైన ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. విద్య, వైద్యం సామాన్యుల చెంతకు చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది.

పలివెల మధు, మండల పరిషత్ విప్, కపిలేశ్వరపురం

మహిళా ప్రాధాన్యతను పెంచిన జగన్ ప్రభుత్వం



గతంలో ఏ ప్రభుత్వమూ పెంచని స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా ప్రాధాన్యతను పెంచిన ఘనత వైఎస్ జగన్‌ది. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్‌ను పార్టీపరంగా అమలు చేయడం ద్వారా నాలాంటి మహిళలెందరో ప్రజాప్రతినిధులయ్యారు. అప్పుడమే కాకుండా ఆయన హయాంలో నెల నెలా సంక్షేమాన్ని అమలు చేయడంతో ఎంపీటీసీగా గర్వంగా భావించేదాన్ని.

నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

కలువ పువ్వు ఏర్పాటుపై దుమారం

- కూడలిలో ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ..
- వేగుళ్ల విగ్రహం జోలికొస్తే సహించబోమని టీడీపీ
- కౌన్సిల్ సమావేశంలో వాడీవేడిగా చర్చ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: స్థానిక కలువ పువ్వు సెంటర్లో కలువ పువ్వు ఏర్పాటు చేసే అంశంపై సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తెలుగుదేశం, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. తొలుత ఈ అంశాన్ని 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ సమావేశంలో లేవ నెత్తారు. పట్టణానికి కలువ పువ్వు తలమానికంగా ఉండేదని ఆయనన్నారు. కలువ పువ్వు సెంటర్ అంటే రాష్ట్రంలో మండపేట అనే నానుడి ఉండేదన్నారు. అక్కడ కలువపువ్వును తీసి వేసి వేగుళ్ల వీర్రాజు సెంటర్ అని పేరు పెట్టినప్పటికీ ప్రజలందరూ ఇప్పటికీ కలువపువ్వు సెంటర్ అనే పిలుస్తున్నారన్నారు. దీనిపై టీడీపీకి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం మాట్లాడుతూ వేగుళ్ల వీర్రాజు విగ్రహం జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదన్నారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలువపువ్వును ఆ కూడలిలో పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ విగ్రహానికి ఇబ్బంది లేకుండా కలువ పువ్వులను విగ్రహం చుట్టూ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చుండ్రు సుబ్బారావు చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ నిలిపి వేసిన బిల్లులన్నీ వెంటనే మంజూరు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. నియోజకవర్గంలో హౌసింగ్ నిధులను కూడా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లులు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. పట్టణంలో ఆక్రమణలను తొలగించాలని, డ్రెయిన్లను ఆక్రమించి మెట్ల నిర్మాణం చేస్తే వాటిని నిరోధించాలని కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ సూచించారు. 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్ తొలగింపునకు పురపాలక సంఘానికి జేసీబీ కొనుగోలు చేయాలని కోరారు. కౌన్సిల్ అజెండాలో బురుగుంట చెరువు అనే పదం ఉండడలం పట్ల రెడ్డి రాధాకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతం వైఎస్ రాజశేఖరరెడ్డి పార్కు అని అలాగే కౌన్సిల్లో తీర్మానం కూడా చేశామని, ఇకపై ఆ విధంగానే పిలవాలని కోరారు. సమావేశంలో డీఈ కె. శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, సత్యనారాయణ, ఆర్వో జేవీఎస్ శాస్త్రి, అధికార, ప్రతిపక్ష సభ్యులు పాల్గొన్నారు.

నేడు సామాజిక పెన్షన్ల పంపిణీకి చర్యలు

రాయవరం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సామాజిక పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలో 10,157 సామాజిక పెన్షన్లకు గాను రూ.4,17,31,500 విడుదలైనట్టు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం 98 శాతం పెన్షన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక కృషి



కాజులూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాజులూరు: కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల తరపున మండల గ్రామాల్లో అమలవుతున్న సంక్షేమ, అబివృద్ధి పథకాల పురోగతిని సభ్యులకు వివరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని త్వరలో వాటి పురోగతికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబరు నాలుగో తేదీ నుంచి రోజుకి నాలుగు గ్రామాల చొప్పున నియోజకవర్గ గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారులకు వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరశర్మ, మండల తహసీల్దార్ శివకుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివాలయంలో మాస శివరాత్రి పూజలు



వెంటూరు శివాలయంలో మాస శివరాత్రి పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో నెలవారీ పూజల్లో భాగంగా పూజాదికాలు చేపట్టారు. లక్షపత్రి పూజా కమిటీ సభ్యులు హనుమంతవరుఝల శ్రీరామశర్మ, శుభాంగి దంపతుల సౌజన్యంతో ఉదయం 8.30 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, దీప, ధూపసేవ నిర్వహించారు. కమిటీ పెద్దలు తటవర్తి రాఘవరాజు, దువ్వూరి రామారావు, వెంకట్రావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి గట్టుపై వాహనాల తనిఖీ



గోదావరి గట్టుపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రవికుమార్

కపిలేశ్వరపురం: స్థానిక గోదావరి గట్టుపై వాహనాలను అంగర ఎస్సై డి.రవికుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. యానాం నుంచి జొన్నాడ మీదుగా వెళ్లే వాహనాలు వేగ నియంత్రణ లేకుండా వెళ్తున్న నేపథ్యంలో వాహన చోదకులను నిలిపి అవగాహన కల్పించారు. యానాం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపాలెం, బందనపూడి తదితర గ్రామాల్లో ఏట పంట పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశ నుంచి ఈనిక దశలో ఉందని ఈ దశలో తెగుళ్ల సోకితే తీవ్రనష్టం ఉంటుదనే ఉద్దేశంతో రైతులు పక్క రైతులను అనుసరిస్తూ తోసిన మందులు పంటపై చల్లుతున్నారన్నారు. పంటలపై రైతులు అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు వాడటం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. పంటలకు సోకు తెగుళ్ల, వాటి ఉధృతి, పంట స్థితిగతులకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పనిచేయక వృథా వ్యయాలు అవుతున్నాయన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతులు నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మెలైన దిగుబడులు సాధించాలన్నారు.

వ్యాసరచన పోటీలకు 522 మంది హాజరు



వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్లో వ్యాసరచన పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని ద్రాక్షారామ, దంగేరు, పామర్రు సత్యసాయి సేవా సమితుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాఠశాలలు, కళాశాలల్లో శని, సోమవారాల్లో ఆధ్యాత్మిక, సేవా గుణాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 522 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ద్రాక్షారామ సమితి కన్వీనర్, జోనల్ బాల వికాస్ ఇన్‌చార్జి విస్సాప్రగడ కృష్ణమూర్తి తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల స్థాయిలోను, సమితి స్థాయిలోను, జిల్లా స్థాయిలోను అదే విధంగా రాష్ట్ర స్థాయిలోను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపిక చేసి వారికి గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ అందించనున్నట్లు కృష్ణమూర్తి ప్రకటించారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ రావిపాటి నారాయణరావు, సబ్ జోనల్ కన్వీనర్లు నున్న నరసింహమూర్తి, వల్లూరి రామారావు, కూర్మాపురం పుల్లయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ తోట పరామర్శ



మీగడ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి దుఃఖంలో మూడు కుటుంబాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పరామర్శించారు. జంగమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్ మాతృమూర్తి వయోభారంతో మరణించారు. రావులపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోకరకొండ ప్రసాద్ తండ్రి నాలుగు రోజుల క్రితం మరణించారు. అదే వీధికి చెందిన ఇంటి శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముగ్గురి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శలలో పార్టీ నాయకులు రెడ్డి రాధాకృష్ణ, జిన్నూరి సత్యసాయిబాబా, పోతంశెట్టి వరప్రసాద్, మెండు బాపిరాజు, మారిశెట్టి సత్యనారాయణ, ముమ్మిడివరపు బాపిరాజు, శెట్టి నాగేశ్వరరావు, షేక్ అలీఖాన్‌బాబా, అన్యం ప్రసాద్, కోళ్ల శ్రీనివాస్, సాధనాల శివ భగవాన్, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సామాజిక ప్రగతికి మెట్టు



టేకిలో వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీ తదితరులు

కపిలేశ్వరపురం: గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తి సామాజిక ప్రగతికి మెట్టు అని ప్రధానోపాధ్యాయుడు కడలి వెంకటరమణ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. వెంకటరమణ మండలంలోని టేకి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా దీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు వెంకటరమణ, మంగావేణి దంపతులను పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కోడి నాగలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, ఎంఈఓ కె. తాతారావు వెంకటరమణ సేవలను కొనియాడారు. యూటీఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జేఈసీ కన్వీనర్ డీవీ రాఘవులు, జిల్లా నాయకులు పి.సురేంద్ర, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజంలో మంచి గుర్తింపు ఇస్తుందన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలి



తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు, బాధితులు

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శిరోముండనం బాధితుల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ బాధిత కుటుంబాలు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, కో కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక చదువుల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత ఐక్య పోరాట వేదిక నాయకులు గుబ్బల శ్రీనివాసరావు, వెంటపల్లి రామకృష్ణ, మేడిశెట్టి ఇజ్రాయెల్, చల్లపూడి పట్టాభిరామయ్య, తాతపూడి రాజు, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కుపుటాలు అదిరేలా..



భీమేశ్వరాలయం పక్క రోడ్డులో ముక్కు మూసుకుని స్కూలుకు వెళుతున్న చిన్నారులు

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి ఈశాన్యంలో పవిత్ర సప్త గోదావరి స్నానఘట్టం ఉంది. ఈ చెరువును ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి పక్కనే చెత్త కొండలా పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త పూర్తిగా తడిచి మురిగునీరు ఏర్పడటంతో ముక్కులు బద్దలయ్యే విధంగా కంపు వెదజల్లుతోంది. నియోజకవర్గంలోనే అతి పెద్ద స్కూలుగా ఉన్న సూర్య హైస్కూల్‌కు ఎక్కువ మంది చిన్నారులు ఇదే రహదారిలో వెళుతుండటంతో ప్రతిరోజు ముక్కు మూసుకునే వెళుతూ ఇబ్బందికి గురవుతున్నారు. ప్రముఖ దేవాలయం పక్కనే ఈ బాధ ఏంటంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ గ్రామానికి చెందిన డంపింగ్ యార్డు పూర్తి స్థాయిలో నిండి పోవడంతో వేరే మార్గంలేక రోడ్డుపైనే చెత్తను నింపేస్తున్నారు. దీంతో ఈ దారిలో వెళ్లేందుకు అందరూ చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూనుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మెప్మాతో మహిళల ఆర్థిక స్వావలంబన



మెప్మా బజార్‌ను సందర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మహిళల ఆర్థిక స్వావలంబనకు మెప్మా అర్బన్ మార్కెట్ ఎంతగానో ఉపయోగపడుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలసి ఆమె ప్రారంభించారు. మార్కెట్లో ఏర్పాటు చేసిన వస్తువులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మీడియాతో మాట్లాడుతూ మెప్మా ద్వారా ఏర్పాటు చేసిన మార్కెట్లు మహిళల ఆర్థిక పురోగతికి ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ చేయూతతో వారు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, గుండు రామతులసి, మందపల్లి రవికుమార్, శిరంగు జ్యోతి, మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కళ్యాణి, మెండు బాపిరాజు, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ ఉంగరాల రాంబాబు, మున్సిపల్ కమిషనర్ టి.రంగారావు, మెప్మా సిటీ మేనేజర్ పి.సుజాత, టి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాక సొసైటీ రైతు మహాజన సభ



మహాజన సభ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం: మండలంలోని వెదురుపాక సొసైటీలో సోమవారం రైతుల మహాజన సభ నిర్వహించారు. సహకారశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ బీఎంఎస్‌బీవీఆర్ కుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సొసైటీ కార్యాలయం భవనం శిథిలస్థితికి చేరుకోవడంతో సొసైటీ కార్యకలాపాలను రైతుభరోసా కేంద్రంలోకి మార్చాలని, సొసైటీ భవన నిర్మాణానికి నిధులను సేకరించాలని, రాయవరంలోని సొసైటీకి సంబంధించి గొడౌన్ అద్దె బకాయిల వసూలు తదితర అంశాలపై మహాజన సభలో చర్చించారు. సమావేశంలో సొసైటీ సెక్రటరీ వి.అన్నవరం, నదురుబాద ఎంపీటీసీ సభ్యుడు వుండవిల్లి సుబ్బారాయుడు, స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చినకృష్ణంరాజు, వెలగల వీర్రెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, దేవిశెట్టి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కూర్మాపురంలో సామూహిక సీమంతాలు



కూర్మాపురంలో నిర్వహిస్తున్న సామూహిక సీమంతాలు

రాయవరం: తల్లీబిడ్డల ఆరోగ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.పెర్సీ పేర్కొన్నారు. మండలంలోని కూర్మాపురంలో సోమవారం మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎ.గజలక్ష్మి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సీమంతాలు చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు న్యూట్రిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గుణ్ణం పనసయ్య, ముత్యాల చంద్రశేఖర్, గొడితి సత్యసాయి సుధాకర్, మందపల్లి చిన సత్యనారాయణ, తవిటికి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పరిసరాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం, సోమవారం రాత్రి సమయాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఆదివారం 4 గురు, సోమవారం ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారన్నారు. వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

నేడు చెకుముకి పరీక్ష

మలికిపురం: మండలస్థాయి చెకుముకి పరీక్ష మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ ఉన్నత పాఠశాల బట్టేలంకలో జరుగుతాయని మండల జనవిజ్ఞానవేదిక(జేవీవీ) సోమవారం తెలిపింది. పాఠశాల 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుల సంతకంతో విద్యార్థులను తీసుకుని ఉదయం 9.30 గంటలకు బట్టేలంక హైస్కూల్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి వాస్తవ్యులు దూళిపాల రవి కిరణ్, ఆయన కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.